వేగుచుక్క

# వామ్మో... "ఆశ" హాస్పిటల్...

- ●చిన్నారెడ్డికి వికటించిన కిడ్నీ స్టోన్ ఆపరేషన్.
- ●యూరాలజీ డాక్టర్ లేకున్నా..బయటి డాక్టర్ తో ఆపరేషన్.
- ●ఇన్ఫెక్షన్ సోకి హైదరాబాద్ యశోద హాస్పిటల్ కు తరలింపు.
- ●రోజుకు లక్ష రూపాయల ఖర్చు.. అయినా హామీ ఇవ్వని యశోద డాక్టర్లు.
- ●ఆందోళనలో బంధువులు.. మంథని గ్రామస్తులు.
- ●గ్రామస్తులతో ఆశ హాస్పిటల్ డాక్టర్ల చర్చలు.
- ●ముందస్తుగా హాస్పిటల్ వద్ద పోలీస్ బందోబస్తు.




**వేగుచుక్క న్యూస్, ఆర్మూర్, ఫిబ్రవరి 15** : అనారోగ్యంతో ఆసుపత్రికి వెళ్తే, కోంత మంది వైద్యుల వల్ల రోగం నయం అవుతుందన్న "ఆశ"లు గల్లంతు అవుతున్నాయి. కిడ్నీ స్టోన్ ఆపరేషన్ వికటించి హైదరాబాద్ యశోద ఆసుపత్రి పాలైన ఘటన ఆర్మూర్ పెర్కిట్ లో ఉన్న ఆశ హాస్పిటల్ లో చోటు చేసుకుంది. వివరాలు లోకి వెళితే ఆర్మూర్ మండలం లోని మంతని గ్రామానికి చెందిన బ్రాహ్మణపల్లి చిన్నారెడ్డి (45) కిడ్నీ స్టోన్ తో బాధపడుతున్నాడు. బంధువులు చిన్నారెడ్డిని గత నెలలో వైద్యం కోసం ఆశ హాస్పిటల్కు తీసుకొచ్చారు. డాక్టర్లు పరీక్షించి ఆపరేషన్ చేయాలని సూచించారు. ఆశ హాస్పిటల్ లో యూరాలజీ డాక్టర్లు అందుబాటులో లేకున్నా నిజామాబాద్ లోని మరొక డాక్టర్ తో ఓపెన్ సర్జరీ చేసి ఆపరేషన్ బాగా జరిగిందని డిశ్చార్జ్ చేశారు. డిశ్చార్జ్ అయిన మూడు రోజులకు విపరీతమైన జ్వరం రావడంతో మళ్లీ ఆశా హాస్పిటల్ కు తీసుకువచ్చారు. ఇన్ఫెక్షన్ అయ్యిందని హైదరాబాదులోని యశోద హాస్పిటల్కు తీసుకెళ్లాలని డాక్టర్లు సూచించారు.. యశోదలో రోజుకు లక్ష అవుతున్న డాక్టర్లు చిన్నారెడ్డి ప్రాణానికి హామీ ఇవ్వడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

**ఆశ డాక్టర్ల నిర్లక్ష్యమే కారణమా..?**

కిడ్నీ స్టోన్ ఆపరేషన్ చేసే యూరాలజీ డాక్టర్ లేరని చెప్పిన మరో హాస్పిటల్కు తీసుకువెళ్లే వాళ్ళమని. మూత్రపిండాన్ని యాక్సెస్ చేయడానికి చిన్న కోత చేసి సన్నని టెలిస్కోప్ పరికరం అయినా నెఫ్రో స్కోప్ కోత ద్వారా మూత్రపిండంలోకి పంపి రాయిని బయటకు





తీస్తారు. లేదా చిన్న ముక్కలుగా చేసి బయటికి తీస్తారు. ఇలా కాకుండా ఓపెన్ సర్జరీ చేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఆందోళనకు వచ్చిన మంతిని గ్రామస్తులతో ఆశ హాస్పిటల్ డాక్టర్లు చర్చలు జరుపుతున్నారు. రోజుకు లక్ష ఖర్చు పెట్టేంత ఆర్థిక స్తోమత లేని బ్రాహ్మణపల్లి చిన్నారెడ్డికి న్యాయం చేయాలని బంధువులు.. గ్రామస్తులు కోరుతున్నారు.

**ఎంతమంది డాక్టర్లకు పట్టాలు ఉన్నాయి..**

ఆశా హాస్పిటల్ లో చిన్నారెడ్డి కిడ్నీ ఆపరేషన్ వికటించడమే కాదు.. అంతకుముందు ఇలాంటి సంఘటనలు జరిగాయని..

గతంలో సిబ్బంది రోగులపై రౌడీల్లాగా దాడి చేసిన సంఘటనలు ఉన్నాయని ప్రజలు చెప్పుకుంటున్నారు. పనిచేసే డాక్టర్లలో ఎంత మందికి డాక్టర్ల పట్టాలు ఉన్నాయో..? పట్టాలు పొందిన వారు ఎంతమంది ఉన్నారో జిల్లా వైద్యశాఖ అధికారులు.. లేదా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) డాక్టర్లు తనిఖీలు చేయాలని రోగులు.. ప్రజలు కోరుతున్నారు.

# ఏఐకేఎంఎస్ నేత దత్తాద్రి అనారోగ్యంతో మృతి.

**వేగుచుక్క న్యూస్, సిరికొండ, ఫిబ్రవరి 15:**

నిజామాబాద్ జిల్లాసిరికొండ మండలం, తాళ్ల రామడుగు గ్రామానికి చెందిన అఖిల భారత రైతు కూలి సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా కార్యవర్గ సభ్యులు దత్తాద్రి శనివారం అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని అఖిల భారత రైతు కూలీ సంఘం



ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డు గంగాధర్ అన్నారు. దత్తాద్రి పేద ప్రజల కోసం రైతంగ సమస్యలపై అనేక పోరాటాలు చేశాడని అన్నారు. అఖిల భారత రైతు కూలిసంఘం (ఏఐకేఎంఎస్) నిజామాబాద్ జిల్లా కార్యవర్గం ఆయనకు విప్లవ జోహార్లు అర్పిస్తూ, ఆయన ఆశయాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగడ సానుభూతి తెలిపారు.

# ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఫిబ్రవరి 15 :**

గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జయంతి ఉత్సవాలలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పాల్గొన్నారు. వినాయకనగర్ లో గల సేవాలాల్ మహరాజ్ విగ్రహానికి కలెక్టర్



స్థానిక ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల బాధ్యులు, జిల్లా అధికారులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం భోగ్ బండార్ లో పాల్గొని నైవేద్యం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి నాగురావు , వివిధ శాఖల అధికారులు, గిరిజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# గిరిజన జీవితాల్లో వెలుగు రేఖ "సేవాలాల్ మహారాజ్".

## - అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ.

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, ఫిబ్రవరి 15**


గిరిజన జీవితాల్లో వెలుగు రేఖ "సేవాలాల్ మహారాజ్" అని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి పురస్కరించుకొని



భారతీయ జనతా పార్టీ గిరిజన మోర్చా ఆధ్వర్యంలో శనివారం నగరంలోని సంతోష్ నగర్ లో సేవాలాల్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ హాజరై, మాట్లాడారు. బంజారా ప్రజల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ గిరిజనులకు చేసిన సేవలు మరువలేనివని , బంజారా జాతి బిడ్డల అభివృద్ధికి, వారిని చైతన్యం చేయడానికి తన జీవితాన్నే త్యాగం చేసిన మహనీయులు సేవాలాల్ మహారాజ్ అన్నారు. గిరిజనులు మద్యం, మాంసాలకు దూరంగా ఉండాలని, జంతు బలిని వ్యతిరేకించి అహింసా సిద్ధాంతానికి పునాదులు వేసి, బంజారా జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయులని కొనియాడారు. హిందూ ధర్మ రక్షణలో సేవాలాల్ చేసిన కృషి మరువలేనిదని, 18వ శతబ్దంలో ఓ వైపు క్రిస్టియన్ మిషనరీలు, మరో వైపు నిజాం మత మార్పిళ్ళు చేస్తుంటే వారికీ వ్యతిరేకంగా బంజారా జాతికి ఏకం చేసి, వారిని హిందూ ధర్మం వైపు నడిపిన

హిందూ ధర్మరక్షకులు సేవాలాల్ మహారాజ్ అన్నారు. సేవాలాల్ మహారాజ్ చేసిన సేవలకు గుర్తుగా పార్లమెంట్ లో అతని విగ్రహాన్ని పెట్టాలని మన ఎంపీ ధర్మపురి అరవింద్ గారు డిమాండ్ చేయడం గిరిజన బిడ్డలు సంతోషించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులచారి,బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మి నారాయణ, మోర్చా నాయకులు, సుందర్ సింగ్ రాథోడ్, మండల అధ్యక్షులు నాగరాజు, మాజీ కార్పొరేటర్ నారాయణ, బీజేపీ నాయకులు ప్రభాకర్, కిరణ్, సాయి నాథ్, తదితరులు పాల్గొన్నారు

# ఇలా అయితే కాంగ్రెస్‌కు కష్టమే..



తెలంగాణలో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వానికి మిత్రపక్షంగా ఉన్న కామ్రేడ్లు కూడా చిన్నగా అసంతృప్తి గళాన్ని వినిపిస్తుండటం గమనార్హం. ఈ క్రమంలోనే.. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుతమున్న పరిస్థితుల్లో స్థానిక సంస్థలకు వెళితే కాంగ్రెస్‌కు కష్టమేనని అభిప్రాయపడ్డారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలపై శ్వేతపత్ర విడుదల చేసిన తర్వాతే స్థానికి సంస్థల ఎన్నికలకు వెళ్లాలని కూనంనేని సూచించారు.

తెలంగాణ రాజకీయాల్లో రోజు రోజుకు కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రజాప్రతినిధుల మాటలు రాజకీయాల్లో అలజడి సృష్టిస్తున్నాయి. ఈ క్రమంలోనే.. కొద్ది రోజులుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు చేస్తున్న వ్యాఖ్యలు సర్వత్రా చర్చనీయాంశంగా మారుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మిత్రపక్షంగా బరిలో దిగిన సీపీఐ.. ఇప్పుడు కూడా ఎమ్మెల్సీ ఎన్నికల్లో, స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కలిసే ముందుకు వెళ్లేందుకు సుముఖత చూపిస్తోంది. అయితే.. గత కొద్ది రోజులుగా కాంగ్రెస్ పార్టీపై, రేవంత్ రెడ్డి సర్కారుపై కూనంనేని సున్నితంగానే చురకలంటిస్తున్నారు.

తాజాగా.. మీడియా సమావేశం నిర్వహించిన కూనంనేని సాంబశివరావు.. స్థానిక సంస్థల ఎన్నికలపై కీలక వ్యాఖ్యలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధి నిరూపించుకోకపోతే.. ప్రభుత్వానికి ఇబ్బందులు తప్పవంటూ చురకలంటించారు. ఢిల్లీలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీకి, కాంగ్రెస్ పార్టీకి అదే పరిస్థితి ఎదురైందని సున్నితంగా హెచ్చరించారు. అమలు చేస్తున్న హామీలపై స్థానిక సంస్థల ఎన్నికల్లో శ్వేత పత్రం విడుదల చేయాలని ప్రభుత్వానికి సూచించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చారని గుర్తు చేసిన కూనంనేని.. అందులో చాలా వరకు అలాగే ఉన్నాయని తెలిపారు. దీని మీద వివరణ ఇచ్చిన తరువాతనే ఎన్నికలకు వెళ్తే మంచిదని కూనంనేని సలహా ఇచ్చారు.

మరోవైపు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై కూడా కూనంనేని సాంబశివరావు తీవ్ర విమర్శలు గుప్పించారు. ఫ్యూడల్ వ్యవస్థ నుంచి మోదీ బయటకు రావడం లేదని దుయ్యబట్టారు. అక్షరాస్యత పెరిగేతేనే దేశంలో పురోగతి ఉంటుందని కూనంనేని సాంబశివ రావు అభిప్రాయపడ్డారు. ఉచితాలు అంటూ ప్రధాని మోదీ దేశ భవిష్యత్తును అపహస్యం చేస్తున్నారన్నారు. మోదీ వ్యాఖ్యలు దేశ స్థితిగతులకు అనుగుణంగా లేవని ఆరోపించారు. పరోక్ష టాక్స్ ద్వారా రూ.22 లక్షల కోట్లు వస్తే.. అందులో 90 శాతం పేదలే కడుతున్నారని.. బడా బాబులు కట్టిన 10 శాతం వల్ల దేశానికి ఎలాంటి ఉపయోగం లేదని కూనంనేని వివరించారు.

పేదలు కట్టిన జీఎస్టీనే ప్రభుత్వాలకు ఆదాయం, బడ్జెట్ రూపాయల్లో వెళ్తున్నాయని కూనంనేని సాంబశివ రావు పేర్కొన్నారు. పేదలకు ఇస్తే వాటిని ఉచితాలు అంటారని.. లక్షల కోట్ల రూపాయలను సంపన్న వర్గాలకు చెందిన కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. భారతదేశంలో ఒక్క శాతం మంది చేతుల్లోనే 45 శాతం సంపద ఉంటే.. మిగతాదంతా పేదల చేతుల్లో ఉందని పేర్కొన్నారు. న్యాయమూర్తులు కూడా ఉచితాల మీద రాజకీయ నేతల్లాగా మాట్లాడుతున్నారని కూనంనేని సాంబశివ రావు అభిప్రాయపడ్డారు.

# పెళ్లయినా ఇదేం పని..!

ప్రేమికుల రోజు సందర్భంగా వరంగల్ రైల్వే స్టేషన్‌లో ఓ లవ్ కపుల్.. అడ్డంగా బుక్కయ్యారు. ప్రేమించి పెళ్లి చేసుకుని ఆరేళ్లు గడుస్తున్నప్పటికీ.. వీళ్ల వాలకం, చేస్తున్న పని చూసి పోలీసులు షాక్ అయ్యారు. ఒడిశాకు చెందిన ఈ ప్రేమ జంట.. వరంగల్ నుంచి ముంబయికి వెళ్లాలని ప్లాన్ చేశారు. కానీ.. అప్పటికే అక్కడ తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు వాళ్లను ఫార్మలిటీకి చెక్ చేయగా.. వాళ్ల బ్యాగులో మబ్బులిడిపోయే సరుకు బయటపడింది. దీంతో వారిని అరెస్ట్ చేశారు పోలీసులు.

ప్రేమికుల రోజు.. వరంగల్ రైల్వే స్టేషన్‌లో ఓ లవ్ కపుల్ ట్రైన్ దిగారు. ఇద్దరూ మంచి డ్రెస్సింగ్‌తో క్లాస్‌గా కనిపిస్తున్నారు. వెల్ ఎడ్యుకేటెడ్.. ఏదో గవర్నమెంట్ జాబర్స్ అయ్యుంటారేమో అనిపించేలా ఉన్నారు. చూసేందుకు కూడా మేడ్ ఫర్ ఈచ్ అదర్ అన్నట్టుగా మంచి జోడీనే. ట్రైన్ దిగి చాలా క్యాజువల్‌గా నడుచుకుంటూ.. మూడో ప్లాట్ ఫామ్ నుంచి బయటకు వెళ్తున్నారు. వాళ్లు వేసుకున్న డ్రెస్సులు, వాళ్ల వాలకం చూస్తే ఎవ్వరికీ ఎలాంటి అనుమానం రాదు. కానీ "ఎక్కడో కొడుతుంది సీనా.." అన్నట్టుగా పోలీసులకు అనుమానం వచ్చింది. ఏదో ఫార్మాలిటీకి ఓసారి చెక్ చేద్దామనుకుని పోలీసులు.. ఆ జంట దగ్గరున్న బ్యాగులను చెక్ చేశారు.

కట్ చేస్తే.. వాళ్ల బ్యాగులు చూసి.. పోలీసులు ఒక్కసారిగా షాక్ అయ్యారు. ఎందుకంటే.. వాళ్ల బ్యాగుల్లో ఉన్నది ఖరీదైన బట్టలో.. అంతకంటే ఖరీదైన బంగారమో కాదు.. ప్యూర్ గంజాయి. వాళ్ల అవతారానికి బ్యాగుల్లో ఉన్న సరుకుకు ఎక్కడా పొంతన కుదరగా.. ఆ బ్యాగులు వాళ్లవేనా అన్నట్టుగా.. పోలీసులు వాళ్లిద్దరి ముఖాలను ఎగాదిగా చూశారు. ఆ జంటను అదుపులోకి తీసుకుని విచారించగా.. అసలు వ్యవహారం బయటపడింది.

ఇంతకూ ఆ లవ్ కపుల్ ఎవరూ.. అసలు వాళ్ల వ్యవహారం ఏంటీ అన్నది తెలిస్తే.. వార్నీ ఇదెక్కడి పోయే కాలంరా సామీ అంటారు. ఈ లవ్ కపుల్‌ది ఒడిశా. పేర్లు.. శంకర్ దాస్, పూర్ణిమ భోగి దాస్. ఈ జంట ఆరేళ్ల క్రితం ప్రేమపెళ్లి చేసుకుంది. ప్రస్తుతం ఈ లవ్ కపుల్ సూరత్‌లో నివాసం ఉంటున్నారు. ప్రేమ పెళ్లి చేసుకున్న ఈ జంట.. బతికేందుకు ఆ సమయంలో ఏం పని చేసేదో కానీ.. ఇప్పుడు మాత్రం దర్జాగా గంజాయి స్మగ్లింగ్ చేస్తోంది. సులభంగా డబ్బు సంపాదించాలన్న ఆశతో.. గంజాయి విక్రయాలకు శ్రీకారం చుట్టింది. ఒడిశా నుంచి మూడో కంటికి తెలియకుండా గంజాయి తీసుకొచ్చి గుజరాత్‌లో విక్రయాలు జరపడం వీళ్ల ప్రధాన దందా.

కొన్నేళ్లుగా ఈ దందాను దర్జాగా ఎవ్వరికీ దొరకకుండా నడిపిస్తూ.. హ్యాపీగా కాలం గడుపుతున్న ఈ ప్రేమ జంటకు ప్రేమికుల రోజే కాలం అడ్డం తిరిగింది. తమ పనిలో భాగంగానే.. ఒడిశాకు వచ్చి ప్రదీప్ అనే స్మగ్లర్ వద్ద గంజాయి కొనుగోలు చేసి రహస్యంగా బ్యాగులో భద్రపరిచారు. ఎలాగూ ఇద్దరు భార్యాభర్తలు కావటంతో.. కాస్త క్లాస్‌గా డ్రెస్సింగ్ చేసుకుంటే ఎవరికీ అనుమానం రాదన్నది వీళ్లు ఫాలో అవుతున్న ప్లాన్. అందుకే ఖరీదైన దుస్తులు ధరించి క్లాస్‌గా తయారై.. రైలు మార్గంలో వరంగల్ మీదుగా సూరత్‌కు వెళ్లాలని ప్లాన్ చేశారు.

వరంగల్ రైల్వేస్టేషన్ వరకు బాగానే వచ్చారు కానీ.. అక్కడే కథ అడ్డం తిరిగింది. రైల్వే స్టేషన్‌లో రైలు దిగిన ఈ ప్రేమ జంట.. మరో మార్గం ద్వారా ముంబయి వెళ్లేందుకు మూడో ప్లాట్ ఫామ్ నుంచి బయటకు వెళుతోంది. అయితే.. వాళ్ల బ్యాడ్ లక్.. అప్పటికే అక్కడ డ్రగ్స్ కంట్రోల్ టీంతో కలిసి మిల్స్ కాలనీ పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. మొదట వాళ్లను చూసి వాళ్ల దగ్గరేముంటుందిలే అనుకున్నారు కానీ.. వృత్తిలో భాగంగా ఫార్మలిటీగా చెక్ చేసి పంపించేద్దామనుకున్నారు. కానీ.. బ్యాగు ఓపెన్ చేసి చూస్తే భారీ ఎత్తున గంజాయి కనిపించింది.

ఖరీదైన దుస్తులు ధరించి క్లాస్‌గా తయారైన ఈ లవ్ కపుల్ బ్యాగులో గంజాయి ప్యాక్ చేసుకొని గుట్టుచప్పుడు కాకుండా రాష్ట్రాలు దాటించడం చూసి పోలీసులు అవాక్కయ్యారు. వాళ్ల దగ్గర 20 కిలోల ఎండు గంజాయి పట్టుబడటంతో.. పోలీసులు వాళ్లిద్దరినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# ఎన్ని కేసులు పెట్టినా తగ్గేదే లేదు

కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర స్థాయిలో ఫైరయ్యారు. రేవంత్ సర్కార్ వైఫల్యాలను ప్రశ్నిస్తే తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారమని మండిపడ్డారు. తమ కార్యకర్తలు, నాయకులపై కేసులు పెట్టి కేసీఆర్‌ను కట్టడి చేయాలని చూస్తున్నారని.. ఎవరిపై ఎన్ని కేసులు పెట్టినా వెనక్కి తగ్గేది లేదని చెప్పారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారని ప్రభుత్వంపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల ఖవిత ఫైరయ్యారు. ఎన్ని కేసులు పెట్టనా వెనక్కి తగ్గేది లేదని చెప్పారు. ఖమ్మం జిల్లా పర్యటనకు వెళ్లిన ఆమె.. ఇటీవల ఓ కేసులో అరెస్ట్ అయి జిల్లా జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న పార్టీ నేత లక్కినేని సురేందర్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన కవిత.. 14 నెలల కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్రానికి వెలగపెట్టింది ఏమి లేదని విమర్శించారు.

'మీ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సురేందర్ లాంటి వారిని అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపడం సరికాదు. మీ వైఫల్యాలను కచ్చితంగా ఎండగడతాం.. ఒక్క సురేందర్‌కే కాదు, రాష్ట్రంలో కార్యకర్తలకు ఎక్కడ కష్టం వచ్చిన అక్కడకు అంతా కలిసి వెళ్లి వారికి అండగా ఉంటాం. ప్రజక్షేత్రంలో కక్షపూరిత రాజకీయాలు సరికాదు. లక్కినేని సురేందర్‌ను అక్రమంగా అరెస్ట్ చేశారు. కేసీఆర్‌ను కట్టడి చేయాలని చూస్తున్నారు. కొందరిని అరెస్ట్ చేస్తే కేసీఆర్‌ను అడ్డుకున్నట్లు భావిస్తున్నరు. రైతుబంధు రాలేదు, బీమా రాలేదు, ఫించన్ రాలేదు, ఉద్యోగాలు రాలేదు, అన్నీ దొంగ మాటలే. 14 నెలల పాలనలో దొంగహామీలే తప్ప చేసింది లేదు. ఖచ్చితంగా ప్రశ్నిస్తాం. పాలించడం చేతకాక అక్రమ కేసులు పెడుతున్నారు. ఎన్ని కేసులు పెట్టినా తగ్గేదే లేదు.

# రైల్వే ప్రయాణికులకు బ్యాడ్‌న్యూస్..

సికింద్రాబాద్– నాగ్‌పూర్ వందే భారత్ ట్రైన్ విషయంలో సౌత్ సెంట్రల్ రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఈ ట్రైన్ 20 కోచ్‌లతో పరుగులు పెడుతుండగా.. కోచ్‌ల సంఖ్యను తగ్గించింది. ఆక్యుపెన్సీ లేకపోటంతో 8 కోచ్‌లతో నడపాలని నిర్ణయం తీసకుంది. ఫిబ్రవరి 19 నుంచి ఈ కుదింపు అమల్లో ఉండనుంది. ట్రైన్ ప్రయాణికులకు సౌత్ సెంట్రల్ రైల్వే బ్యాడ్‌న్యూస్ చెప్పింది. సికింద్రాబాద్– నాగ్‌పూర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్ కోచ్‌లను తగ్గించింది. ప్రస్తుతం 20 కోచ్‌లతో ట్రైన్ నడుస్తుండగా.. ఫిబ్రవరి 19 నుంచి 8 కోచ్‌లతో నడపాలని నిర్ణయం తీసుకున్నారు. వ్యాపారాలు, ఉద్యోగాలు చేసేవారు తెలంగాణ నుంచి నిత్యం ప్రయాణాలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో తెలంగాణ నుంచి ట్రైన్ కనెక్టివిటీ పెంచాలని హైదరాబాద్ నుంచి విశాఖ, తిరుపతి, బెంగళూరులతో పాటుగా నాగ్‌పుర్ నగరానికి ట్రైన్ అందుబాటు లోకి తీసుకొచ్చారు.

తిరుపతి, బెంగళూరులకు చాలా నెలల క్రితమే ట్రైన్లు అందుబాటులోకి రాగా.. సికింద్రాబాద్–నాగపూర్ ట్రైన్ మాత్రం గతేడాది సెప్టెంబర్ 16న ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చింది. ప్రధాని నరేంద్ర మోదీ ఈ ట్రైన్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. అయితే ట్రైన్ ప్రారంభించినపప్పటి నుంచి ఆక్యుపెన్సీ లేదు. మ్మొత్తం 20 బోగీలతో ఈ ట్రైన్లు నడుస్తుండగా.. సగం సీట్లు కూడా నిండటం లేదు. ట్రైన్‌లో దాదాపుగా అన్ని కోచ్‌లు ఖాళీగానే ఉంటున్నాయి.

# కొత్త రేషన్ కార్డులపై బిగ్ అప్డేట్.. జారీ చేసేది అప్పుడే..!

తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించిన విషయం తెలిసిందే. జనవరి 26వ తేదీన లాంఛనంగా ప్రారంభించగా.. ఈ ప్రక్రియ కొనసాగుతోంది. అయితే.. ఇప్పటికే ఎంపిక చేసిన అర్హులకు, కొత్తగా దరఖాస్తు చేసుకుంటున్న వారికి రేషన్ కార్డులు ఎప్పుడు మంజూరు చేస్తారన్నది ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఈ నేపథ్యంలో.. బిగ్ అప్డేట్ వచ్చింది. కొత్త రేషన్ కార్డులు జారీ చేసేది ఎప్పుడనేది తెలుస్తోంది.

తెలంగాణలో ఎక్కడ చూసినా కొత్త రేషన్ కార్డుల గురించే చర్చ నడుస్తోంది. జనవరి 26వ తేదీన రేవంత్ రెడ్డి సర్కార్ కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియను లాంఛనంగా ప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే.. అంతకు ముందే ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులను ఆధారంగా చేసుకుని క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహించి.. అర్హుల జాబితాలను ప్రభుత్వం సిద్ధం చేసింది. ఈ జాబితాలను గ్రామసభల్లో ప్రకటించారు కూడా. అయితే.. ఆ జాబితాల్లో లేని చాలా మంది తాము కూడా అర్హులమేనని.. అయినా తమ పేర్లు



జాబితాల్లో రాలేదంటూ గగ్గోలు పెట్టటంతో.. వారందరికీ కూడా ప్రభుత్వం మరోసారి అవకాశం కల్పించింది. దగ్గరిలోని మీ–సేవా కేంద్రాల్లో ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని రేవంత్ రెడ్డి సర్కార్ కల్పించింది. దీంతో.. జనాలంతా మీ–సేవా కేంద్రాలకు క్యూ కట్టారు.

అయితే.. రేషన్ కార్డుల జారీ అనేది నిరంతర ప్రక్రియ అని.. ఎప్పుడైనా ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం పదే పదే చెప్తోంది.

అయితే.. ప్రకటించిన జాబితాల్లోని అర్హులకు కొత్త రేషన్ కార్డులు ఎప్పుడి స్తారు..? ఇప్పుడు కొత్తగా దరఖాస్తు చేసుకుంటున్న వారికి ఎప్పుడిస్తారన్న అంశంపై ప్రజల్లో గందరగోళం ఏర్పడింది. ఈ క్రమంలో.. కొత్త రేషన్ కార్డుల జారీపై బిగ్ అప్డేట్ వచ్చింది. అయితే.. ప్రస్తుతం దరఖాస్తున్న చేసుకుంటున్న అప్లికేషన్లను పరిశీలించి.. వాటి ఆధారంగా క్షేత్రస్థాయిలో సర్వే చేసి.. అర్హులా కాదా అని నిర్ధారించి.. అప్పుడు జారీ చేయాల్సి ఉంటుంది కాబట్టి.. ఇంకా సమయం పట్టే అవకాశం ఉంది.

అయితే.. ఇప్పటికే ప్రకటించిన జాబితాల్లోని అర్హులకు కొత్త రేషన్ కార్డులు జారీ చేసేందుకు పెద్దగా పని లేకపోయినప్పటికీ.. మరింత సమయం పట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. ఎందుకంటే.. ప్రస్తుతం తెలంగాణలోని పలు జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులో ఉంది. మెదక్– నిజామాబాద్– ఆదిలాబాద్– కరీంనగర్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నిక జరగనుండగా... వరంగల్– ఖమ్మం– నల్గొండ జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి. అయితే.. ఈ రెండు స్థానాలకు ఫిబ్రవరి 27వ తేదీన పోలింగ్ జరగనుంది. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా.. ఆయా జిల్లాల్లో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వచ్చింది. దీంతో.. ఈ కోడ్ ముగిసేవరకు రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిలిచిపోనుంది. దీంతో.. పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎలక్షన్ ముగిసిన తర్వాతే.. కొత్త రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ మొదలవనుందని తెలుస్తోంది.

అయితే.. కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు ప్రక్రియ మాత్రం కొనసాగుతుందని ప్రభుత్వం చెప్తోంది. కొత్త రేషన్ కార్డుల జారీ అనేది నిరంతర ప్రక్రియ అని.. మీ–సేవా కేంద్రాల్లో అప్లై చేసుకోవాలని ప్రభుత్వ వర్గాలు సూచిస్తున్నాయి. ఎప్పటికప్పుడు కొత్త దరఖాస్తులను పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు జారీ చేస్తామని ప్రభుత్వం చెప్తోంది.

